రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	సా.6.24
సహరీ (సోమ)	ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	33	27

అంతా ఓకే!

- కోనసీమ జిల్లా పి.గన్నవరంలో రాజకీయ ఉత్కంఠకు తెర
- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధికారిక ప్రకటన
- జోష్‌లో ఉన్న గన్నవరం నియోజకవర్గ కూటమి శ్రేణులు
- ఉమ్మడి తూర్పుగోదావరిలో అన్ని సీట్లకు అభ్యర్థులు ఖరారు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయపరంగా ఉత్కంఠ రేపిన పి.గన్నవరం రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పోటీ చేస్తున్నట్టు ప్రకటించింది. స్వయంగా జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణే ఈ ప్రకటన చేశారు. నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును శనివారం ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి విడత జాబితాలో పి.గన్నవరం స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. అయితే రాజేష్ అభ్యర్థిత్వం పట్ల వ్యక్తమైన అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని మార్పు అనివార్యమైంది. టీడీపీ ఖాతాలో ఉన్న ఈ సీటు వ్యూహాత్మకంగా జనసేనకు దక్కింది. టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ యూట్యూబ్ చానల్‌లో గతంలో టీడీపీ, జనసేన, హిందూ కులాలకు వ్యతిరేకంగా చేసిన వీడియోల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ ప్రజలు, ఆయా పార్టీల కేడర్ వ్యతిరేకించడంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీకి నష్టం కలగకూడదనే సదుద్దేశంతో మహాసేన రాజేష్ స్వచ్ఛందంగా తానే గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిత్వం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటన చేశారు. పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా టీడీపీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన స్వచ్ఛంద ప్రకటన సారాంశం. అయితే తరువాత తన నిర్ణయం పట్ల పార్టీ నుంచి ఎటువంటి స్పందన వెలువడకపోవడంతో మళ్లీ పోటీ చేసేందుకు రాజేష్ సిద్ధంగా ఉన్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పి.గన్నవరం అభ్యర్థిత్వం ఆటలాడుకుందనే చెప్పాలి. ఆయా పార్టీలకు చెందినవారు ఆ నియోజకవర్గం నుంచి తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తూ నియోజకవర్గ ఓటర్లను గందరగోళంలో ముంచెత్తారు. టీడీపీ నుంచి కొందరు. బీజేపీ నుంచి టీఎస్ఎన్ మూర్తి, మానేపల్లి అయ్యాజీవేమాల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తింది. అయితే గన్నవరం సీటు పైనే ఆశలు పెట్టుకుని పోలీసు శాఖలో చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణచేసి జనసేనలో చేరిన గిడ్డి సత్యనారాయణ పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నాన్ని కొనసాగించడంతో చివరకు విజయం సాధించారు. టీడీపీ స్థానంలో జనసేన నుంచి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం చేసిన ప్రకటనతో ఈ నియోజకవర్గంపై అటు టీడీపీ, ఇటు బీజేపీలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. దాంతో జనసేన కేడర్‌లో ఆనందం పెల్లుబికుతోంది. పైగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న జనసేన విజేతల సమాచారాన్ని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తం చేయడంతోపాటు వారు పార్టీ కోసం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకుని గన్నవరం స్థానం నుంచి జనసేన అభ్యర్థిని పోటీలోకి పెడుతున్నామని, మీరంతా కష్టపడి పనిచేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మొత్తం మీద తొలి జాబితాలో టీడీపీ ప్రకటించిన స్థానాన్ని జిల్లాలో చిట్టచివరి స్థానంగా జనసేన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ క్రమంలో అభ్యర్థుల బలాబలాలపై తాజా చర్చ మొదలైంది.



పి.గన్నవరం అభ్యర్థి గిడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న పవన్

పి.గన్నవరాన్ని పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా అందిస్తా

- జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సహకారంతో పి.గన్నవరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి జనసేనాని పవన్‌కల్యాణ్ గిఫ్ట్‌గా అందిస్తా. నామీద నమ్మకంతో సీటు కేటాయించిన పవన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. జనసేన అధినేత ఆశయాలతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రతి నిరుపేదకు అండగా నిలుస్తాను. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

అభ్యర్థి వివరాలివీ..

గిడ్డి సత్యనారాయణ స్వగ్రామం పి గన్నవరం మండలం ఊడిమూడి శివారు ఊడిమూడిలంక. బీఏ, బీఎల్ చదువుకున్న ఆయన హైదరాబాదు సిటీ కమిషనర్ కార్యాలయంలో 20 ఏళ్లగా అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయపరంగా 1989లో తెలుగు యువత జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఇటీవల జనసేనలో చేరిన ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంలోని అన్ని సీట్లకు అభ్యర్థులను టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించింది. తొలి సీటును మండపేట నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారు. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును తమ అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజానగరం నుంచి తమ పార్టీ పోటీ చేస్తున్నట్టు తొలిసారిగా ప్రకటించారు. ఆ తర్వాత విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ రాగా చివరిగా శనివారం పి గన్నవరం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను పవన్ ప్రకటించడంతో అన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. ఇక పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లు ఉండగా, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో పశ్చిమగోదావరి నుంచి కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీట్లు వచ్చి చేరాయి. అంటే రంపచోడవరంతో కలిపి 22 సీట్లు అయ్యాయి.

మొత్తం అసెంబ్లీ సీట్లు : 22

ఉమ్మడిగా సీట్ల పంపకం..

తెలుగుదేశం : 16, జనసేన : 6



రథోత్సవం

యానాం భూసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. తొలుత చిన్న రథంలో, తర్వాత పెద్ద రథంలో మీసాల వెంకన్నను ఊరేగించారు.

- యానాం

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే.. సీ-విజిల్‌లో ఫిర్యాదు చేయండి!



కలెక్టర్ హిమాన్షుశుక్లా

అమలాపురం టౌన్, మార్చి23: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఏవైనా సంఘటనలను పౌరులు గుర్తిస్తే వెంటనే సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదులు నమోదు చేయవచ్చని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై, యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను శనివారం కలెక్టర్ ఆదేశించారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫొటో, వీడియో, ఆడియో రూపంలో రికార్డుచేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్ డౌన్లోడ్ చేసుకుని ఫోన్ నంబరు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో సొమ్ములు పంపిణీ, ఉచితంగా అందజేయడం, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ ఇలా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దానిని ఫీల్డు యూనిట్‌కు పంపిస్తారన్నారు. కంట్రోల్ కేంద్రాలు నిరంతరం పనిచేయాలని, రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అమలు చేయనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన ఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత రిటర్నింగ్ అధికారి కింద పనిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి జీతం, వేతనం, గౌరవభృతి తీసుకునే ప్రతీ ఒక్కరికీ నియమావళి వర్తిస్తుందని, వారు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనకూడదని కలెక్టర్ చెప్పారు.



ఏరియా ఆసుపత్రి వద్ద ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శన దృశ్యం

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే కీలకం

జిల్లా ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు

అమలాపురం రూరల్, మార్చి 23: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే కీలకమని జిల్లా ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు పేర్కొన్నారు. ఇమ్మిడివరప్పాడు మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో శనివారం స్వీప్ కార్యక్రమాన్ని వృద్ధులతో కలసి నిర్వహించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు స్వీప్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును నిష్పక్షపాతంగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధి ఎంపికె. భీమారావు, వృద్ధాశ్రమం డైరెక్టర్ విక్టర్ డానియేల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్వచ్ఛందంగా ఓటు వేద్దాం.. సుపరిపాలన అందిద్దాం అంటూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజేస్తూ అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల జిల్లా నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో ఓటుకు నోటు అసలే వద్దు అంటూ ఓటు విలువను వివరిస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై వారితో ప్రతిజ్ఞ చేయించారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

జిల్లావ్యాప్తంగా పరీక్షలకు 733 మంది గైర్హాజరు

ముమ్మిడివరం, మార్చి23: జిల్లాలో పదోతరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఫిజికల్ సైన్స్ పరీక్షకు సంబంధించి జిల్లాలోని 112 పరీక్షా కేంద్రాల్లో 20,520 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 19,787 మంది పరీక్షకు హాజరయ్యారు. 733 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను డీఈవో ఎం.కమలకుమారి, రెండు పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సురేష్, నాలుగు పరీక్షా కేంద్రాలను డీవైఈవో ఎన్.ఫణి, 24 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ గానీ, మాల్‌ప్రాక్టీసు గానీ జరగలేదని డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. ముమ్మిడివరం మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో శనివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఫిజికల్ సైన్స్‌కు సంబంధించి 733 మంది హాజరు కావాల్సి ఉండగా 721 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఎం.రామచంద్రరావు తెలిపారు.

ఓటు నమోదుకు ఇంకా అవకాశం

- ఏప్రిల్ 15వతేదీ వరకు నమోదు... ఓటు ఉందో.. లేదో చూసుకోండి
- నేరుగా అధికారులకు దరఖాస్తు.. ఆన్‌లైన్‌లో సులువుగా నమోదు



పాలగుమ్మి లో ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్న శిలాఫలకం

ఇంట్లో శిలాఫలకం!

సామాజిక స్థలంలో ఇళ్ల పట్టాలు

ఎప్పుడిచ్చారంటూ స్థానికుల ప్రశ్నలు

అమలాపురం రూరల్, మార్చి 23: ఓహెచ్ఎస్సార్ నిర్మాణం కోసం సిద్ధం చేసిన శిలాఫలకం ఇది. మంత్రి పినిపే విశ్వరూప్ ఆ శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించేందుకు పాలగుమ్మి జగనన్న కాలనీలో అధికారులు ఏర్పాట్లుచేశారు. కోడ్ అమలులోకి రావడంతో ఆ శిలాఫలకం అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు ఆ శిలాఫలకం ఇంటి నిర్మాణం మధ్యలోకి రావడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. కాలనీలో 86 మందికి మూడేళ్ల కిందట ఇళ్లస్థల పట్టాలు అందించారు. ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో రెండు ఇంటి స్థలాలను సామాజిక అవసరాల కోసం వదిలేశారు. ఆ ప్రాంతంలో గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కారానికి ఓహెచ్‌స్సార్ నిర్మాణం చేయాలని 2022 డిసెంబరు నెలలో పంచాయతీ తీర్మానం చేశారు. జలజీవన్ మిషన్ నిధులు విడుదల కావడంతో ఓహెచ్ఎస్సార్ నిర్మాణానికి అదే స్థలంలో శంకుస్థాపనచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు. కోడ్‌తో అది నిలిచిపోగా ఎప్పుడు ఇక్కడ ఇళ్ల స్థలపట్టాలు ఇచ్చారో తెలియదు. జనుపల్లి, పేరూరు గ్రామాలకు చెందిన ఇద్దరు లబ్ధిదారులు ఇళ్లస్థల నిర్మాణాలు హడావుడిగా ప్రారంభించారు. ఓ రాజకీయ నాయకుని అండదండలతోనే ఓహెచ్ఎస్సార్ నిర్మాణానికి తీర్మానించిన స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి కూడా పట్టాలు ఇచ్చిన విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయకపోవడం గమనార్హం. గ్రామంలో ఇంకా అర్హులైన పేద కుటుంబాలు పదికి పైగా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోగా పక్క గ్రామాల వారికి ఇళ్లస్థల పట్టాలు ఇవ్వడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే సమయంలోనే పంచాయతీ అధికారులు పనులు నిలుపుదల చేయాలని చెప్పినా పట్టించుకోకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. శిలా ఫలకాన్ని ఇంటినిర్మాణంలో కలిపి కట్టేస్తున్నా పట్టించుకోరా అని స్థానికులు మండిపడుతున్నారు.





టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి హరీష్, అసెంబ్లీ అభ్యర్థులు బుచ్చిబాబు, సత్యానందరావు, జోగేశ్వరరావు, ఆనందరావు

అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయాలి

- విజయవాడ వర్క్‌షాపులో జిల్లా అభ్యర్థులకు చంద్రబాబు పిలుపు
- లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్ సహా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులంతా హాజరు

అమలాపురం, మార్చి23 (ఆంధ్రజ్యోతి): స్వలాభం కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో కాదు... రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకున్నట్టు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాలులో టీడీపీ ప్రకటించిన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతో శనివారం నిర్వహించిన వర్క్‌షాపులో అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అయితాబత్తుల ఆనందరావు(అమలాపురం), బండారు సత్యానందరావు(కొత్తపేట), దాట్ల సుబ్బరాజు(ముమ్మిడివరం), వేగుళ్ల జోగేశ్వరరావు(మండపేట), వాసంశెట్టి సుభాష్(రామచంద్రపురం)లు హాజరయ్యారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి రాకుండా చేయడానికే పొత్తులతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పొత్తు అంశంలో పవన్‌కల్యాణ్ ముందుకువచ్చారు. పవన్‌కల్యాణ్ నిబద్ధత కలిగిన వ్యక్తి. ఆ పార్టీ కార్యకర్తలు కూడా అంతే నిబద్ధతతో ఉన్నారు. పొత్తుల కాకుండా సీట్లు కోల్పోయిన వారి త్యాగాన్ని ఎప్పుడూ మరిచిపోనని, వారికి సముచిత ప్రాధాన్యతా స్థానం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 31 మంది టీడీపీ ముఖ్య నేతలకు సీట్లు ఇవ్వలేని పరిస్థితిపై వివరణ ఇచ్చారు. ఎన్నికల్లో అభ్యర్థులంతా ప్రతీ కార్యకర్తలను సంఘటితం చేసుకుని కచ్చితంగా అన్ని స్థానాలను గెలుచుకునేలా వ్యూహాత్మక పోరాటాన్ని చేయాలని చంద్రబాబు అభ్యర్థులకు పిలుపునిచ్చారు. రాగద్వేషాలకు అతీతంగా పార్టీలలో ఉన్న అందరినీ కలుపుకుపోవాలని, ఒక్క ఓటు కూడా చీలకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమలులో అధికారపక్షం తిలోదకాలు ఇచ్చి చేస్తున్న ప్రచారాలపై ప్రతీ ఒక్కరు ఓ కంట కనిపెట్టాలని, ఎప్పటికప్పుడు వారి అక్రమాలు, ఆగడాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి ఇందుకు కృషి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలు, ప్రత్యర్థులను ధీటుగా ఎలా ఎదుర్కొవాలనే అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కింజవరపు అచ్చెన్నాయుడు, జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ తదితరులు వర్క్‌షాపులో పాల్గొని అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. కోనసీమ జిల్లాకు చెందిన టీడీపీ అభ్యర్థులంతా హాజరయ్యారు.



మంగళగిరి జనసేన కార్యాలయంలో జరిగిన పి గన్నవరం నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

రాష్ట్రంలో పొత్తుకు నాంది మీ నియోజకవర్గమే..

సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించండి : పవన్ పిలుపు

పి.గన్నవరం, మార్చి 23: రాష్ట్రంలో పొత్తుకు నాంది పలికింది మీ నియోజకవర్గమేనని మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో శనివారం జరిగిన సమావేశంలో జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టంచేసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో లోపాయికారీ ఒప్పందాలతో టీడీపీ, జనసేన పొత్తు ఏర్పాటుచేసుకుని అనుసరించిన తీరు అభినందనీయమన్నారని పవన్ అన్నారు. అత్యధిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లతోపాటు ఎంపీపీని గెలిపించి పొత్తుకు ఆదర్శంగా నిలిచారని, అదే నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న గిడ్డి సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందని పవన్ ప్రకటించారు. పొత్తులో భాగంగా టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అత్యధిక మెజార్టీతో గెలిపించి తీసుకురావాలని పవన్‌కల్యాణ్ కోరినట్టు పార్టీ నేతలు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శులు వాసంశెట్టి కుమార్, మద్దా చంటిబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల అధ్యక్షులు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయికృష్ణ, పొలిశెట్టి రాజేష్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాజోలు ఉమ్మడి జనసేన అభ్యర్థికి భారీ ర్యాలీతో స్వాగతం





సఖినేటిపల్లి రేవు నుంచి ర్యాలీగా వస్తున్న దేవ వరప్రసాద్.. (పైన) మలికిపురంలో వరప్రసాద్‌తో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని

అంతర్వేది/మలికిపురం, మార్చి 23: రాజోలు నియోజకవర్గ అసెంబ్లీ జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ శనివారం తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేశారు. ఆయనకు సఖినేటిపల్లి రేవులో ఘన స్వాగతం పలికారు. తొలుత రేవులో పంటు దిగిన దేవ వరప్రసాద్ స్థానికంగా ఉన్న వినాయకుడిని దర్శించుకుని అనంతరం పాస్టర్లు, ముస్లిం మత పెద్దలతో ప్రార్థనల అనంతరం బైకు ర్యాలీ ప్రారంభించారు. మూడు కిలోమీటర్ల మేర బైకులు, కారులతో కిక్కిరిసిన మూడు పార్టీల నాయకుల కోలాహలం నడుమ వరప్రసాద్ ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా దేవ వరప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం దిండి గ్రామంలో పుట్టిన తాను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నత ఉద్యోగంచేసి పదవీ విరమణ అనంతరం ప్రజలకు సేవ చేయడానికి వచ్చానన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించేందుకు యుద్ధం చేస్తున్నారన్నారు. ఈ యుద్ధంలో మనమంతా సైనికులుగా పోరాడి విజయం సాధించాలన్నారు. తొలిసారి వచ్చిన మాకు ఇంత ఘన స్వాగతం పలికిన మహిళలకు, నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. బైకు ర్యాలీలో దారి పొడవునా దేవ వరప్రసాద్‌కు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు డాక్టర్ రాపాక రమేష్ బాబు, సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, గుబ్బల ఫణికుమార్, రావూరి నాగు, ఉండపల్లి అంజి, రేపూరి ఏసు, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, బందెల పద్మ, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు గెడ్డం సింహ, నల్లి మోహనరావు, నియోజకవర్గ జనసేన కార్యకర్తలు, నాయకులతోపాటు సఖినేటిపల్లి మండల 16 గ్రామశాఖల అధ్యక్షులు, వీరమహిళలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో టిక్కెట్ కోసం ప్రయత్నించిన బొంతు రాజేశ్వరరావు వర్గీయులు పాల్గొనలేదు. బొంతును బలపరిచిన మలికిపురం, రాజోలు, జనసేన మండలాల పార్టీ అధ్యక్షులు మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్‌లు ర్యాలీలో గైర్హాజరయ్యారు.



ఓటు నమోదుకు ఇంకా అవకాశం

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం, అలాంటి ఓటు ఉందో లేదో ఒక్కసారి ఓటర్ల జాబితాలో చూసి పరిశీలించుకోవాలి. ఓటు ద్వారానే ప్రజలకు మేలు చేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలం. ప్రజాస్వామ్యంలో నిరంకుశత్వవాదులను తరిమికొట్టాలంటే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. కాకినాడ జిల్లాలో 16 లక్షల 11 వేల మంది ఓటర్లు ఉన్నారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే అవగాహన లేకపోవడం వలన ఇప్పటికీ కొంతమంది ఓటు ఉందో లేదో పరిశీలించుకోలేకపోతున్నారు. అలాంటి వారి కోసం ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున ఇక నుంచి జాబితా నుంచి ఓట్ల తొలగింపు, మార్పులకు అవకాశం లేదు. కేవలం కొత్తగా నమోదుకు మాత్రమే అవకాశం కల్పించారు. అయితే ఓటర్ల జాబితాలో ఓటు లేనివారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు.



ఫారం 6 సమర్పించాలి

ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వారు బూత్‌స్థాయి అధికారులకు ఫారం 6 దరఖాస్తు సమర్పించాలి. అలాగే ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. వారికి కూడా దరఖాస్తులను సమర్పించవచ్చును. అలాగే ప్రతి మండలంలో తహసీల్దార్ గానీ డిప్యూటీ తహసీల్దార్‌ను గానీ సంప్రదించి దరఖాస్తులను ఇచ్చి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్న 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చును.

www.nvsp.in వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. రిజిస్టర్ యాజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేసిన అనంతరం ఫాం 6 దరఖాస్తు ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే ఆన్‌లైన్ దరఖాస్తు కనిపిస్తుంది. దానిలో అడిగిన వివరాలు నింపి సబ్‌మిట్ కొట్టాలి. ఆ తర్వాత ఫోన్ నెంబర్‌కు రిఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి ఇంటి అడ్రస్‌కు వచ్చి పరిశీలిస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు.





కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23:

ప్లేస్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి చెందిన ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మీ ఫోన్ నెంబర్ వివరాలు పొందుపర్చి రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత లాగిన్ అయ్యి ఓటర్ రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళితే న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తు నింపి సబ్‌మిట్ చేయాలి. https://voterportal.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యి వెబ్‌సైట్‌లో ప్రవేశించిన తర్వాత న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ అనే విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తులో వివరాలు నింపి సబ్‌మిట్ చేయాలి.

- ఏప్రిల్ 15వతేదీ వరకు నమోదు
- ఒక్కసారి ఓటు ఉందో.. లేదో పరిశీలించుకోండి
- ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటే
- ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితా పరిశీలించుకోవాలి
- నేరుగా అధికారులకు దరఖాస్తు
- ఆన్‌లైన్‌లోనూ సులువుగా నమోదు

కొత్తగా నమోదు చేసుకోండి

రామ్‌సుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా



ఇప్పటికీ కూడా ఎవరిదైనా ఓటు జాబితాలో లేకపోతే కొత్తగా నమోదు చేసుకోవచ్చనని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి చెప్పారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. అయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు ఇక లేవన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చునని వెల్లడించారు. దీని కోసం జిల్లాతో పాటు మండల స్థాయిలో కూడా ఎన్నికల అధికారులను సంప్రదించాలన్నారు.



గోవిందా..గోవింద

భక్తజన సంద్రంగా మారిన వాడపల్లి

ఆత్రేయపురం, మార్చి23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రమైంది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 42 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 20 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.48.82 లక్షలు లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి



అల్లవరం, మార్చి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌లో టాటా సంస్థ స్టోర్ ఇన్‌చార్జి కొల్లు వెంకటరమణరావు (55) వడదెబ్బకు మృతిచెందాడు. ఓడలరేవుకు చెందిన ఆయన శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 3.30గంటలకు స్టోర్ నుంచి కిలోమీటరు నడిచివెళ్లి కుప్పకూలిపోయాడు. టాటా సిబ్బంది అతడిని బెండమూర్లంక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. టీడీపీ నేత, మాజీ సర్పంచ్ కొల్లల సత్యనారాయణమూర్తి తనయుడు ఈయన.

నేటి నుంచి ఆర్జిత సేవగా రథసేవ

అన్నవరం, మార్చి 23: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం నుంచి నూతనంగా మరో ఆర్జితసేవను ప్రవేశబెట్టనున్నారు. ఇటీవల చేయించిన నూతన రథంపై స్వామి, అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. అయితే దీనిని ఆర్జిత సేవగా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆమోద ముద్ర వేయడంతో రూ.2500 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. ఈ టికెట్ తీసుకునే భక్తులకు ముందుగా గోత్రనామాలతో పూజలు చేసి స్వామివారి కండువా రవికల వస్త్రం, ప్రసాదం ప్యాకెట్లను అందజేయడంతో పాటుగా నలుగురికి అంతరాలయ దర్శన ప్రవేశం కల్పించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యానాం, మార్చి 23: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అశేష జనవాహినితో యానాం రహదారులు కిక్కిరిసిపోయాయి. కళిరెడ్డి సత్యవీరవెంకన్న, కళిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణేశ్వరరావు ఉత్సవదారులుగా రథోత్సవం నిర్వహించారు. స్థానిక చిన్న సెంటర్ వద్ద స్వామివారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రతినిధులు, పలువురు ప్రముఖులు శనివారం సాయంత్రం 4.45గంటలకు ప్రారంభించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రథంలో వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త బస్టాండ్‌లో భక్తుల దర్శనార్థం రథాన్ని ఉంచారు. తొలుత చిన్న రథంలో స్వామివారిని ఉంచి యానాం వీధుల్లో ఊరేగించారు. అనంతరం పెద్ద రథంలో స్వామివారిని కొలువుదీర్చి పిల్లారాయ వీధిలో ఊరేగించారు. ఎస్పీ రాజశేఖర్ నేతృత్వంలో సీఐ షణ్ముగం పోలీసు బందోబస్తు నిర్వహించారు.


రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ కిటకిట

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన వీధులు
- గజ వాహనంపై గ్రామోత్సవం


వైభవంగా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం


తరలివచ్చిన భక్తులు

కోరుకొండ, మార్చి 23: కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో 4వ రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి విచ్చేశారు. కొండపైన, కొండ దిగువున సుమారు 30 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరందరికీ మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదే విధంగా రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 92వ విశిష్టాద్వైత పండిత సభలను భక్తులు సందర్శించారు. 4వ రోజున పరాసర లక్ష్మీనరసింహ భట్టర్‌స్వామి అధ్యక్షతన జరిగిన సభల్లో ఉభయ వేదాంత పండితులు కేఈ స్వామి, కేఈ తలసాయి స్వామి, పరాసర రఘునాథ భట్టర్‌స్వామి, పరాసర శ్రీ వత్స చిన్న భట్టర్ స్వామి, ఇరగవపు కృష్ణామాచార్యుల స్వామి ఉపన్యసించారు. రామాయణం, మహాభారత, భాగవత, బ్రహ్మసూత్రములు, ఆళ్వారుల దివ్య ప్రబంధంలోని విషయాలను పామరులకు సైతం అర్థమయ్యే విధంగా తెలియజేశారు. లక్ష్మీ నరసింహ స్వామి కళావేదికపై చిన్నారుల ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. సుమారు 20 వేల మందికిపైగా మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో అన్న ప్రసాదం అందజేసినట్లు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు.

గజ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు రాత్రి స్వామి వారు గజ వాహనంపై గ్రామోత్సవం చేశారు. ప్రతిరోజు సాయంత్రం జరిగే నిత్య హోమం, బలిహరణ, సేవాకాలం అనంతరం స్వామి వారిని గజవాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి అశ్వవాహనం గ్రామంలో నాలుగు మాఢ వీధుల్లో విహరించింది. భక్తులు స్వామి వారికి పండ్లు ఫలహారాలు సమర్పించి మంగళనీరాజనాలు అందజేశారు.

వైభవంగా శ్రీ రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

శనివారం రాత్రి 10 గంటలకు రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పర్యవేక్షణలో గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులైన ఎస్‌టీపీ వెంకటరమణాచార్యుల స్వామి వెంకటరమణాచార్యులు స్వామి దంపతులచే కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.

'పొన్నాడ'కు నిరసన సెగ

- చొల్లంగి గ్రామంలో అడ్డుకున్న మహిళలు
- మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించిన నేతలు
- ఎదురుతిరిగిన గ్రామస్థులు


పొన్నాడను అడ్డుకున్న మహిళలు

తాళ్లరేవు, మార్చి 23: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు నిరసన సెగలు తగిలాయి. చొల్లంగి మహిళలు శనివారం ఎమ్మెల్యేను అడ్డుకుని ఇతర నియోజకవర్గాల లబ్ధిదారులకు సర్వేనెం.47/3, 4.24 సెంట్లలో ఇండ్లస్థలాలు ఇవ్వొద్దని ఈ స్థలాలను స్థానికులకే ఇవ్వాలని లబ్ధిదారులు 47 రోజులుగా నిరసన దీక్షలు చేసినా ఎమ్మెల్యే కానీ, వైసీపీ నేతలు కానీ ఏవిధంగా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికల వచ్చాయని ఓట్లు కావాల్సి వచ్చాయా అని ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తన దృష్టికి రాలేదని ఎమ్మెల్యే చెప్పారు. ఎవ్వరికో తమ గ్రామంలో ఇండ్లస్థలాలు ఇచ్చి ఓట్లు మాత్రం మమ్మల్ని అడగడం ఎందుకని నిలదీశారు. ఓట్లు అడిగే అర్హత మీకులేదని అన్నారు. దీంతో ఎమ్మెల్యే, లబ్ధిదారులు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వైసీపీ నాయకులు లబ్ధిదారులను తోలు తీసేస్తామనడంతో మహిళలు వైసీపీ నాయకులపై ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో భయపడిన నాయకులు అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్థానికులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 23: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ 2,86,700, అన్నదాన విరాళాలు ద్వారా రూ. 60,237 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,720, తులాభారం రూ.300 వెరసి రూ.3,52,957 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ లొంగుబాటు

ఎటపాక, మార్చి3: మావోయిస్ట్ పార్టీకి చెందిన కిష్టారం ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్‌గా వ్యవహరిస్తున్న మడివి ఊరలు అలియాస్ ఊర శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓఎస్డీ కె.మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో సాకిలేరు గ్రామానికి చెందిన ఊర మావోయిస్ట్ పార్టీలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. 2006 సంవత్సరంలో దర్బగుడా గ్రామంలో ఇద్దరు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అలాగే 2006 సంవత్సరంలో బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో ఊర పాల్గొన్నాడని, ఆ ఘటనలో 9 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మృతిచెందినట్లు చెప్పారు. 2007 సంవత్సరంలో ఇంజరం సమీపంలోని చీకకొరుగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అదే ఏడాది కుంట పీఎస్ పరిధిలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇంచార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ సభ్యులు (మావోయిస్టులు) జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మరణించినట్లు చెప్పారు. జనజీవన స్రవంతిలో కలిసిన ఊరకు రూ 4 లక్షల రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు కల్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. సీఐ డి.రామారావు, ఎస్ఐ కె పార్థసారథి పాల్గొన్నారు.

అండగా నిలిచే పార్టీలకే మా మద్దతు


- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం
- 'జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం నిర్ణయం

సర్పవరం జంక్షన్, మార్చి 23: 'జయలక్ష్మి సొసైటీ పాత కార్యవర్గం నిర్వాహకులు ఆర్థిక మోసానికి పాల్పడి ఏప్రిల్ 6వ తేదీకి రెండేళ్లు కావస్తోంది. మోసపోయిన వారిలో 50 మంది బాధితులు చనిపోయారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. బాధితులకు అండగా నిలిచే రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుంది' జయలక్ష్మి సొసైటీ బాధిత సంఘం సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో గల జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎదుట బాధిత సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు, అంగర నరసింహారావు, చిప్పల శంకరం, కృష్ణారావు, పల్లంరాజు, రాజగోపాల్ మాట్లాడుతూ పాత చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అయితే నూతన పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు నిందితుల ఆస్తులు గుర్తించి సీబీసీఐడీ ద్వారా న్యాయస్థానం ద్వారా సీజ్ చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయస్థానం నుంచి త్వరలో అనుమతులు వచ్చేలా కృషి చేయాలన్నారు. 50 మంది బాధితులు చనిపోతే ప్రభుత్వం నయాపైసా నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. సుమారు 300 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయని, అడ్వాన్సుగా బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. బాధితులంతా సుమారు 20 వేల మంది ఉన్నామని, వైజాగ్ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు 7 నియోజకవర్గాల్లో సుమారు 2 లక్షల ఓట్లు తమకు ఉన్నాయన్నారు. ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లో బాధితుల సంఘం నుంచి ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపి నిరసన తెలియజేసి సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు.

అభ్యుదయ రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

దివాన్‌చెరువు, మార్చి 23: ప్రతి ఆర్బీకే పరిధిలో ఐదుగురు అభ్యుదయ రైతులను గుర్తించి వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.విజయాభినందన చెప్పారు. వీఏఏల సహాయంతో వారికి సందేశాలను పంపాలని సూచించారు. దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రాన్ని మారుటేరు పరిశోధన స్థానం అధికారి డాక్టర్ డి.శ్రీనివాస్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరువాక కేంద్రం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని కాలానుగుణంగా రైతులకు చేరవేయడంలో కృతకృత్యులయ్యారని అన్నారు. భవిష్యత్‌లో ఇంకా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు ఏరువాక కేంద్రం మరింత చేరువ కావాలంటే అనుసరించాల్సిన విధానాలను సూచించారు. మారుటేరు పరిశోధనా స్థానం అధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో జిల్లాలో చాలా మంది రైతులు ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాలు ద్వారాను, ఇ-విస్తరణ ద్వారానూ రైతులకు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయాభినందనను ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్తలు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ హైమజ్యోతి ఘనంగా సత్కరించారు.

భద్రాచలానికి తలంబ్రాల బియ్యం


తలంబ్రాల బియ్యాన్ని పంపిస్తున్న భక్తులు

నల్లజర్ల,మార్చి 24: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం ఉభయగోదావరి జిల్లాల్లో రామభక్తుల నుంచి సేకరించిన ఐదు టన్నుల బియ్యాన్ని భద్రాచలం పంపించినట్టు శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి జంగారెడ్డి గూడెం సభ్యులు పేర్కొన్నారు. శనివారం నల్లజర్లలో జెండా ఊపి బియ్యం వాహనాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులకు శ్రీరాముని తలంబ్రాలు అందించే నిమిత్తం తాము ఈ కార్యక్రమం తలపెట్టినట్టు సభ్యులు పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, బిక్కిన శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు చెప్పారు.

శనేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

కొత్తపేట, మార్చి23: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి ప్రతఃకాళ అర్చన అనంతరం సర్వదర్శనములకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి తైలాభిషేకాలకు క్యూ కట్టారు. అలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.12,79,153 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. విశాఖపట్నానికి చెందిన వాడపల్లి శేసేంద్రభానుప్రకాష్ రెండువేల మజ్జిగ ప్యాకెట్లు, 50 కేజీల దద్ధోజ్యనం భక్తులకు వితరణ చేశారు. అలాగే వృద్ధులు, వికలాంగుల సౌకర్యం కోసం ఉచిత ఆటోను దేవస్థానం ఏర్పాటు చేసింది.


అభిషేకాలు నిర్వహించుకుంటున్న భక్తులు

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన

మండపేట, మార్చి 23: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీవీఎస్ ఎల్లారావు అన్నారు. శనివారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ పాఠశాల వద్ద ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, కమిషనర్ రాము, సీడీపీవో గజలక్ష్మీ, అంగన్‌వాడి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు మహిళలు చేరిక



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన మహిళలు

మండపేట, మార్చి23: టీడీపీకి మహిళల ఆదరణ మరువలేనిదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పార్టీ 23,26 వార్డుల ఇన్‌చార్జులు బొడ్డు రామకృష్ణ, పిల్లా గణపతిరావు సారధ్యంలో వార్డులకు చెందిన పలువురు మహిళలు వేగుళ్ల సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. వారిని వేగుళ్ల పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జొన్నపల్లి రామతులసీ, చవ్వాకుల సాయివరలక్ష్మి, గంతకారి రమణ, మల్లువలస లక్ష్మీ, కుమారి శాంతమ్మ, మంగ, రమణ, శిరిష, పూడమ్మ, రమణ, నాగదేవి, శిరిష, నాగదేవి, దుర్గ వున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కడియాల వెంకటలక్ష్మీ, వాదా ప్రసాదరావు, వెంకటరమణ, నెల్లిపూడి సత్యనారాయణ, వంకమణి, నామాల వెంకటరమణ పాల్గొన్నారు.





నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌ను కలిసిన వేగుళ్ల

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల

విజయవాడలో శనివారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ వర్క్‌షాపు కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్థానిక నేతలతో కలిసి హాజరయ్యారు. టీడీపీ యువనేత నారా లోకేష్, జనసేన నేత నాదెండ్ల మనోహర్‌లను వేగుళ్ల మర్యాదపూర్వకంగా కలిసారు. మండపేట నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితుల, పార్టీ గురించి వేగుళ్ల వారికి వివరించారు. ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధిస్తానని నేతలకు వేగుళ్ల వివరించారు. వర్క్షాపులో టీడీపీ నేతలు మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, కాశిన కాశీవిశ్వనాధం పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు సంఘటితంగా సాగాలి



ఉద్యోగ విరమణ చేసిన బీసీ ఉద్యోగులను సన్మానించిన జిల్లా సంఘ నాయకుడు

అమలాపురం టౌన్, మార్చి 23: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘటితంగా ముందుకు సాగాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ పేర్కొన్నారు. మురళీకృష్ణ అధ్యక్షతన అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాసంఘ సమావేశం నిర్వహించారు. తొలుత మహాత్మా జ్యోతిరావుపూలే, జ్యోతిబాపూలే చిత్రపటాలకు జిల్లా, రాష్ట్ర సంఘ నాయకులు గుత్తల వీరబ్రహ్మం, ఎస్.రాజరాజేశ్వరి, విత్తనాల శ్రీనివాస్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. జిల్లాలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బీసీ ఉద్యోగులు గుబ్బల అప్పారావు, కడలి నాగేశ్వరరావు, గోలి బృహస్పతి, కుడుపూడి రాంబాబు, అవిడి వెంకటసత్యనారాయణ, వాసంశెట్టి గోవిందరాజు, మొల్లేటి సురేంద్ర, జాన శ్రీనివాసరావు, వీరిన శ్రీనివాసరావు, జోగి శాంతికుమారిలను జిల్లా సంఘం తరుపున ఘనంగా సత్కరించారు. జిల్లాప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సరిదే సత్యపల్లంరాజు, పెచ్చెట్టి శ్రీనివాస్, బొక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కపిలేశ్వరపురం, మార్చి 23: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆప్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బి.పావన్‌మూర్తి అన్నారు. శనివారం అంగర చేనేత సహకార సొసైటీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చేనేత కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మజూరీ, పేమెంట్‌లు పెంచాలని పూర్తిస్థాయిలో యార్న్ ఇప్పించాలని తదితర సమస్యలు ఎండీ దృష్టికి కార్మికులు తీసుకువచ్చారు. అనంతరం సొసైటీలోని చీరలు, వాటి నాణ్యత తయారీ, నిల్వలు తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ లివరీ వెరైటీ (కార్పెట్‌లు, దుప్పట్లు, టవల్స్) తదితర స్టాక్‌ను పెంచుకోవాలని సూచించారు. వీటికి సంబంధించి యార్న్ ఆప్కో నుంచి సప్లయ్ చేస్తామన్నారు. సొసైటీ మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ సొసైటీలో 90లక్షల వరకు స్టాక్ నిల్వలు ఉన్నట్లు, నెలకు 16నుంచి 17లక్షల వరకు ప్రొడక్షన్ వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగర పర్సన్ ఇన్‌చార్జ్ ఎం.రాజు, ఆప్కో టీఏ శ్రీకాంత్, గుడిమెట్ల శివరామకృష్ణ , నల్లూరు, నేలటూరు, మండపేట సొసైటీల సెక్రటరీలు, వీవర్స్ సభ్యులు పాల్గొన్నారు.



అంగరలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఆప్కో ఎండీ

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సత్కారం



అమలాపురం టౌన్, మార్చి 23: పబ్లిక్ ప్రాసిక్యూటర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో సత్కరించారు. రాజమహేంద్రవరంలోని ఎనిమిదవ ఏడీజే కోర్టు అండ్ స్పెషల్ కోర్టు ఫర్ క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్, కాకినాడ పోక్సో కోర్టుల్లో ట్రయల్ నిర్వహించిన 13 కేసుల్లో చార్జిషీటు నమోదైన నిందితులకు జైలు శిక్ష పడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మారిశెట్టి వెంకటేశ్వరరావు, పితాని శ్రీనివాసరావులను ఎస్పీ శ్రీధర్ దుశ్శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. అడ్మిన్ ఎస్పీ ఎస్‌కే ఖాదర్‌బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, దిశ డీఎస్పీ వై.గోవిందరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బి.రాజశేఖరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన భారీ బైకు ర్యాలీ

రాజోలు, మార్చి 23: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశీస్సులతో రాజోలు విచ్చేసిన జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ భారీ బైకు ర్యాలీ శనివారం నిర్వహించారు. సఖినేటిపల్లి రేవు నుంచి మలికిపురం, రాజోలు, తాటిపాక సెంటర్ వరకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ నిర్వహించారు.

అమరవీరులకు ఘన నివాళి

- సర్దార్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో కాగడాల ప్రదర్శన.. ఘన నివాళులు

అమలాపురం టౌన్, మార్చి 23: అమలాపురం భగత్‌సింగ్ సెంటర్‌లో ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధాకొండ ఆధ్వర్యంలో శనివారం సర్దార్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిశెట్టి త్రిమూర్తులు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జక్కం జయకృష్ణ, రమణాతి శ్రీనివాసరావు, రవణం సుబ్బారావు, గోకరకొండ సుబ్బారావు, కల్వకొలను సత్తిబాబు, అడపా పుష్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎర్రవంతెన వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆర్పీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, డివిజన్ కార్యదర్శి కేవీ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు పి.నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్నా, పాము వెంకటేశ్వరరావు, బి.రుద్ర, కె.అశోక్‌కుమార్, వి.వెంకట్రాజు పాల్గొన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమలాపురం ఏలిమ్ విద్యాసంస్థల ఆవరణలో అమరవీరులకుని వాళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు పాటు పడాలని తిరుపతిరావు పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ ఎస్.రమేష్, బి.ప్రతాప్, వి.రాజేష్, కె.రమేష్, ఎస్.వరదరాజు పాల్గొన్నారు.



రామచంద్రపురం: కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ముమ్మిడివరం: సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని ముమ్మిడివరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ త్యాగాలను వారు వివరించారు. పార్టీ నాయకులు సకిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, దొమ్మేటి వీరరాఘవులు, మాదే శ్రీనుబాబు, ఎం.లక్ష్మణరావు, వై.బాలరాజు, రమ్యశ్రీ, రాంబాబు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి పురస్కరించుకుని శనివారం రాత్రి రామచంద్రపురంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు కాగడాలతో ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బి.సిద్దూ,అరుణోదయా సాంస్కృతిక సమాఖ్య జిల్లాకార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, మైనార్టీ సంఘం నాయకులు అలీ, అలీ హుస్సేన్, కార్మిక సంఘం నాయకులు చింతా రాజారెడ్డి, లక్ష్మణ్, వీర్రెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు సాయి, కరుణాకరన్ పాల్గొన్నారు.



అమలాపురం: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్ వర్ధంతి

మలికిపురం, మార్చి 23: దిండిలో భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించి నివాళులర్పించారు. చెల్లుబోయిన తాతారావు, దేవ సురేష్, నల్లి చిట్టిబాబు, దేవ నాగభూషణం, పెద్దిరెడ్డి రామారావు, పుల్లెల ఆనంద్ పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి

అమలాపురం టౌన్, మార్చి 23: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు, బర్మాకేసరి దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అమలాపురం సూర్యనగర్‌లో రాయుడు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య సమాఖ్య వ్యవస్థాపకుడు ముషిణి రామకృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మట్టపర్తి నరసింహమూర్తి, ఎ.సోమేశ్వరరావు, కె.ప్రవీణ్, ఎం.లక్ష్మణ్, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, డి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: పొదలాడలో టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పొదలాడ సర్పంచ్ కడలి సత్యనారాయణ స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ జాతి గౌరవాన్ని పెంచిన నాయకుడు వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, కాండ్రేగుల సత్యనారాయణ, కడలి నారాయణమూర్తి, మానుకొండ దుర్గాప్రసాద్, పోతురాజు రాధాకృష్ణ, కాండ్రేగుల స్వామి, లంకె వెంకటనారాయణ, గాలిదేవర వెంకన్నబాబు, పాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒలింపియాడ్ శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మండపేట, మార్చి 23: తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. 16మంది గోల్డ్‌మెడల్స్, 180 మంది ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. ఆరో తరగతి విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఇవ్వటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. విద్యార్థులను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ యానాం ఇన్‌చార్జిగా గొల్లపల్లి

యానాం, మార్చి 23: బీజేపీ ఎన్నికల యానాం ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను నియమిస్తూ బీజేపీ పుదుచ్చేరి రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఎస్.సెల్వగణపతి ఉత్తర్వులు జారీచేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం ప్రాంతాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, మార్చి 23: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన కోన వీరవెంకటమునేశ్వరరావు దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్త దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

సాయిబాబా నవరాత్రి ఉత్సవాలు

కె.గంగవరం, మార్చి 23: అముజూరులోని సాయిబాబా ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. తొమ్మిది రోజులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయిబాబాకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్న విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అంబాజీపేట, మార్చి 23: ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో ఈనెల27న శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద వేదపండితులు సుసర్ల బుజ్జి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట, మార్చి 23: అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు కేంద్రాల్లో భౌతిక శాస్త్రం పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాషలు తెలిపారు.

గోదావరి తెలుగు ప్రతిభా పరీక్షలో ర్యాంకర్లు

మలికిపురం, మార్చి 23: గోదావరి తెలుగు ప్రతిభా పరీక్షలో రాష్ట్రస్థాయిలో విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎ.శరత్‌చంద్ర మొదటి ర్యాంకు, 9వ తరగతి విద్యార్థిని ఆర్.నేహశ్రీ 2వ ర్యాంకు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ తెలిపారు. విద్యార్థులను మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఎ.పద్మజ, కటకం సునీత, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

వల్లూరులో తోట పర్యటన

కపిలేశ్వరపురం, మార్చి 23: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వల్లూరులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా సింహాచలం, వైసీపీ సీనియర్ నాయకులు చుండ్రు చిట్టిబాబు, పుట్టా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహానికి ముసుగా..



అమలాపురం రూరల్, మార్చి 23: ఇదేమి విడ్డూరం.. అల్లూరి విగ్రహానికి ముసుగులా.. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రాజకీయ నాయకులు, పార్టీ వ్యవస్థాపకుల విగ్రహాలకు ముసుగులు వేయడం సహజం. కానీ శనివారం అమలాపురం మండలం సమనస-రంగాపురం గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పంచాయతీ సిబ్బంది ముసుగులు వేస్తుండడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు, అల్లూరి సీతారామరాజు, కాటన్ విగ్రహాలకు సంబంధం ఏమిటో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల గోడపై జగన్ ఫొటోతో పోస్టర్



మామిడికుదురు, మార్చి 23: మామిడికుదురు ప్రభుత్వ కళాశాల సిబ్బంది ఎన్నికల కోడ్‌ను పాటించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కళాశాల గోడలకు జగన్ ఫొటోతో ముద్రించిన వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన గోడ పత్రికలు అంటించి ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వాటిని ఇంకా తొలగించలేదు.

ఓటు హక్కుపై ప్లకార్డుల ప్రదర్శన

ఆత్రేయపురం, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటరామయ్య పేర్కొన్నారు. శనివారం వాడపల్లిలో ఓటు హక్కుపై వేలాది మందికి అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్న ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యం వివరించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఓటర్లను చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భవాని, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో భక్త జనం

ఆత్రేయపురం, మార్చి 23: ర్యాలి జగన్మోహిని కేశవస్వామిని త్రయోదశి శనివారం వివిధ ప్రాంతాల నుంచి అశేష భక్తజనం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అన్నప్రసాద ట్రస్టుకు దాతలు విరాళాలు అందించినట్లు ఈవో కృష్ణచైతన్య తెలిపారు.

చేపలు ఎండబెట్టే యంత్రాలపై శిక్షణ

అల్లవరం, మార్చి23: న్యూఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని అరగట్లపాలెంలో మత్స్యకారులకు చేపలు ఎండబెట్టే యంత్రాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆధునిక పద్ధతులు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి, డాక్టర్ డీవీ జనార్ధనరావు, ఎం.నారాయణమూర్తి, కె.విజయప్రసాద్, డాక్టర్ జి.జెనా, డాక్టర్ బి.వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి ఎస్‌డీ నాయుడు పాల్గొన్నారు.

డ్రగ్స్ కుంభకోణంలో కేంద్రం చర్యలు తీసుకోవాలి

మలికిపురం, మార్చి 23: బ్రెజిల్ దేశం నుంచి రెండు రోజుల క్రితం కంటైనర్ల ద్వారా వచ్చిన డ్రగ్స్‌ను విశాఖపట్నం పోర్టులో సీబీఐ అధికారులు పట్టుకోవడంతో దీని వెనుక ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. దీనిపై సీబీఐ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మామిడికుదురు, మార్చి 23: మాకనపాలెంలో కొలువైన శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం అధిక సంఖ్యలో భక్త దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం స్వామివారు గంధర్వశ్వ వాహనంపై ఊరేగారు. అనంతరం శ్రీపద్మనాభ బుర్రకథ పార్టీ ఆధ్వర్యంలో ఉత్తర కల్యాణం బుర్రకథ భక్తులను ఆకట్టుకుంది.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ఆలమూరు. మార్చి23: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా మూదిదిబ్బ మండలం వేములవారిపల్లె గ్రామానికి చెందిన ఊదపల్లి రమేష్(45) ఆలమూరు-జొన్నాడ ఏటిగట్టు పక్కన ఉన్న మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. రమేష్ సోదరుడు రామకృష్ణ 30ఏళ్ల నుంచి ఆలమూరులో నివాసం ఉంటున్నాడు. రమేష్‌కు వివాహం కాలేదు. అన్న రామకృష్ణ వద్దకు డబ్బుల కోసం రమేష్ అనంతపురం నుంచి అప్పుడు అప్పుడు వస్తుంటేవాడు. ఈనెల19న రామకృష్ణ వద్దకు డబ్బుల కోసం రమేష్ వచ్చాడు. అయితే శనివారం ఏటిగట్టు పక్కన మామిడిచెట్టుకు రమేష్ ఉరి వేసుకుని మృతి చెంది ఉండటంతో రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాయక్ తెలిపారు. తల్లిదండ్రులు లేరు, వివాహం చేసుకోలేదు, అప్పులు ఎక్కువ చేయడం, చెడు వేసనాలకు పాల్పడటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది.

కొత్తపేటలో ఓ ఇంట్లో చోరీ

కొత్తపేట, మార్చి 23: కొత్తపేటలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు బంగారం, నగదు అపహరించారు. బొరుసు వెంకటఉదయభాస్కర్ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండగా కొత్తపేట న్యూబ్యాంకు కాలనీలో అతని తల్లి మాత్రమే ఉండేది. ఇటీవల ఆమె అస్వస్థతకు గురికావడంతో ఆమె కూడా హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో ఉండటంలేదని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీ పాల్పడ్డారు. అయితే చోరీ ఎప్పుడు జరిగిందో తెలియదు. శనివారం ఉదయం పని మనిషి ఇంటి పరిసరాలను శుభ్రం చేసేందుకు వెళ్లగా తలుపులు తీసివేసి ఉండటాన్ని గమనించి లోపలకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఎస్ఐ ఎం.అశోక్‌లు సంఘటనస్థలానికి వెళ్లి పరిశీలించి అమలాపురం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించారు. క్లూస్ టీమ్ వెలిముద్రలు సేకరించింది. ఆరుకాసుల నాలుగు బంగారం గాజులు, కొంత నగదు అపహరించిన్నట్లు గుర్తించారు. గనిశెట్టి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.3,22,937

మామిడికుదురు, మార్చి 23: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.3,22,937 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని 3,095మంది దర్శించుకుని 2,571మంది నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వేద మార్గంతోనే ముక్తి సాధ్యం

ఆలమూరు, మార్చి 23: వేదమార్గంతోనే జీవుడు జీవన ముక్తిని పొందగలుగుతాడని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన పండితుడు కుప్పా విశ్వనాథశర్మ పేర్కొన్నారు. వేదంలోని ధర్మ సూత్రాలను అనుసరిస్తూ జీవనం సాగించడం ద్వారా ముక్తిని పొందవచ్చన్నారు. శనివారం పెదపళ్ల తూర్పువీధి రామాలయం వద్ద జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో విశ్వనాథశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణభగవానుడు వేద ధర్మానికి ప్రతీకలని, గ్రామంలో ఒకేసారి వేణుగోపాలస్వామి, శ్రీరామచంద్రమూర్తి నూతన శిలావిగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ధర్మబద్ధమైన జీవనం సాధించడం ద్వారా మోక్షం పొందవచ్చని, సత్యాన్ని పలకమని, ధర్మాన్ని ఆచరించమని వేదం చెబుతుందన్నారు. విశ్వనాథశర్మను కాకర్లమూడి చిట్టిబాబు-అన్నపూర్ణ దంపతులు ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు కాకర్లమూడి సుభద్రాదేవి పాల్గొన్నారు.

అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ ఎంపికపై హర్షం

అంబాజీపేట, మార్చి 23: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన గిడ్డి సత్యనారాయణను ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో జరిగిన సమావేశంలో మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడలో పార్టీ మండల నేతలు సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, సుంకర నాయుడు, ఆరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, బుచ్చిరాజు, కొప్పినీడి సాయిసూర్య, యర్రంశెట్టి నాగేంద్ర, బోణగిరి భూషణంనాయుడు, కొర్లపాటి డిల్లీ పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించాలి

ద్రాక్షారామ, మార్చి 23: జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించాలని బీసీ నాయకుడు యాట్ల నాగేశ్వరరావు కోరారు. ద్రాక్షారామ మసీదు సెంటర్‌లో మహాత్మాజ్యోతీరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు ముసుగులు వేయడం వారిని అవమానపరచడమేనన్నారు. ఎన్నికల సంఘం ఈవిషయంలో పునరాలోచన చేయాలన్నారు.

భాష్యంలో ఘనంగా హోలీ వేడుకలు

రాయవరం, మార్చి 23: రాయవరం భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో చిన్నారులు రంగులు చల్లుకుని హోలీ వేడుకలు జరుపుకున్నారు. హోలీ పండుగ విశిష్టతను విద్యార్థులు తెలియజేసేందుకు హోలీ పాఠశాలలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ద్వారంపూడి చిన్నబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై డీలర్లకు అవగాహన

రాయవరం, మార్చి23: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎరువుల వ్యాపారస్తులు ఎన్నికల ప్రవర్తన నియామావళిని పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ సూచించారు. శనివారం రాయవరంలో ఎరువుల డీలర్లకు ఎన్నికల నియమావళిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎరువుల షాపుల వద్ద రాజకీయ పార్టీల ఫొటోలు, గుర్తులు లేకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తేచర్యలు తప్పవన్నారు.

ఘనంగా సూర్యప్రభ వాహన మహోత్సవం

రావులపాలెం, మార్చి 23: రావులపాలెంలోని శ్రీఅలివేలు మంగపద్మావతి ఆండాల్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షికబ్రహ్మోత్సవాలలో భాగంగా సూర్యప్రభ వాహన మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు గోవింద మాలధార దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అనన్య
వెంకటరమణ	: లైన్‌మెన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: రజాకార్
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఓం భీం బుష్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భీమా

ధాన్యం కొనుగోలుకు సమాయత్తం కావాలి

ముమ్మిడివరం, మార్చి 23: రబీ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ బి.శ్రీనునాయక్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలుపై క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సదస్సులో ధాన్యం కొనుగోలుకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సివిల్ సప్లయి డీటీ భారతి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యదర్శులు పాల్గొన్నారు.

సినీ గేయ రచయితకు సన్మానం

మామిడికుదురు, మార్చి 23: ప్రముఖ సినీ గేయ రచయిత మాష్టర్జీ శనివారం మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో దళిత నాయకులను కలుసుకున్నారు. మానవ వనరుల కేంద్రంలో గల బోయి భీమన్న విగ్రహానికి మాష్టర్జీ నివాళులర్పించారు. సినీ గేయ రచయితగా ఆయన ప్రస్థానాన్ని పలువురు కొనియాడి ఆయన్ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, గౌస్ మొహిద్దీన్, డాక్టర్ పోలమూరి విక్రమ్, అప్పన రామకృష్ణ, నీతిపూడి మహేష్, కలిగితి పల్లంరాజు, భూపతి వెంకటపతిపాల్గొన్నారు.